# డబ్బు!, డబ్బు!! -డబ్బు!!!

అప్పుడే బజారునుంచి ఇంటికివొచ్చిన గోపీకి ఇల్లంతా గల్లంతుగా కనిపించింది. తండ్రి వరండాలో విచారంగా పచార్లు చేస్తున్నాడు. గోపీని చూచి పెదమొహంపెట్టి "వైరొచ్చింది. పెదనాన్న బ్రతకడం!" అన్నాడు

గోపీ హృదయం హటాత్తుగా ఆగిపోయినట్లయింది. అలాగే నిల బడిపోయాడు—

పెదనాన్నంటే అతనికి ప్రాణం. తన్ను పెంచాడు. చేతులమీదుగా పెద్దవాణ్ని చేశాడు. "నాకేమీ కోర్కెల్లేవురా! నీవు పెద్దవాడవైతే చూచి పోదామని వుంధి" అనేవాడు. ఎంతపని జరిగింది?

తండ్రి కన్నీరు తుడుచుకుంటూ అడిగాడు....

"వస్తావా?"

గోపీ "వస్తాను" అన్నట్లు తలూపాడు.

"నా దగ్గర డబ్బులేదు. అయిదు రూపాయిలుంటే ఇవ్వు"

గోపీ మాట్లాడలేదు. జేబులోవున్న అయిదురూపాయిలూ తీసి యిచ్చాడు.

తండ్రి పెట్టే, బట్టలూ సర్దుకుంటూ, "ప్రయాణం అవ్వు. రైలు టైమైంది. ఆలస్యం అయితే ఆఖరిమాపులుకూడా అందవు." అన్నాడు.

గోపీ కన్నీరు కనపడకుండా మొహం అవతలకు తిప్పుకొని, "మీరీ బండికి వెళ్ళండి. నేను సాయంకాలం వస్తాను" అన్నాడు.

తండ్రికి ఆశ్చర్యం వేసింది. ఒక్కక్షణం బట్టలు సర్దటం ఆపాడు.

ఎగాదిగా చూచి, "ఎందుకని? చాల ప్రమాదంగా వుందట. ఈ బండికి బయల్దేరకపోతే—" గోపీ మిగిలిన మాటలు వినలేక అవతలికి వెళ్ళి పోయాడు.

తండ్రి అలాగే అనుమానంగా క్రోధంగా గోపీని చూశాడు. చాలా రోజులనుంచీ అతడు తండ్రికి అర్థంకావటంలేదు. మొదట్లో కొడుకులో తన ప్రతిబింబమూ చూచుకొని సంతోషించేవాడు. తరువాత ఏ బింబమూ కనపించేదికాదు. ఇప్పుడు మరీ గొడవగా, ఘోరంగా కనుపిస్తున్నాడు.

"సరే, నీ యిష్టం" అని చెప్పి రైలుకు బయల్దేరిపోయాడు.

గోపీ ఒక్క నిట్టూర్పు విడిచాడు. 'పెద్దనాన్నని చూడాలి. ఆఖరి మాటలు ఈచెవిని వేసుకోవాలి.' అని నిశ్చయించుకొన్నాడు. డబ్బులేదు వున్న అయిదురూపాయిలూ తండ్రికిచ్చాడు. ఎవర్నడగాలి? ఎలా అడగటం?

వూరంతా తిరిగాడు. స్నేహితులందర్నీ చూశాడు. వారితో అదీ ఇదీ మాట్లాడి డబ్బు వూసెత్తకుండా ఇంటికి తిరిగివచ్చాడు. గది తలుపులు వేసుకొని వంటరిగా కూర్చొని ఏడ్చాడు.

(వైప్)

అక్కడ, గోపీతండ్రి వెళ్ళేటప్పటికే పెదనాన్న అవసానదశలో వున్నాడు.

తమ్ముణ్ణిచూడగానే, "గోపీ వచ్చాడా?" అని అడిగాడు.

"నేను రమ్మన్నాను. సాయంకాలం వస్తానన్నాడు."

సాయంకాలం రైలొచ్చింది గోపీ రాలేదు. అప్పటికే పెదనాన్న గోపీకోసం ప్రాణాలు బిగపట్టుకొని వున్నాడు. చీమ చిటుక్కుమంటే 'గోపీ!' అనేవాడు.

రైలొచ్చింది గోపీ రాలేదు.

'గోపీని—చూడాలని....వుంది. చూడలేకపోయాను.' అంటూ ప్రాణాలు విడిచాడు పెదనాన్న.

అందరూ గొల్లుమన్నారు—

'దుర్మార్గుడు చూపుకైనా అందుకోకపోయాడు. ముసలివాణ్ణి అసంతృప్తితో చంపాడు' అన్నారు. ఎవ్వరి నోటికి వచ్చినట్లు వారాడిపోసుకున్నారు.

గోపీతండ్రి ఈ మాటలన్నీ వింటూ కూర్చున్నాడు.మండిపోయింది. "ఛండాలుడు. కడుపున చెడబుట్టాడు—" పండ్లు పటపట కొరుకుతూ అనుకున్నాడు.

(వైప్)

ఇక్కడ గోపీకి ఆ రాత్రి నిద్రపట్టలేదు. తెల్లవారుగానే లేచి, ఏమైనా వుత్తరం వచ్చిందేమో చూట్టానికి పోస్టాఫీసుకి వెళ్ళాడు. వుత్తరం రాలేదు. మనస్సు కొంచెం కుదుటపడ్డది. బహుశా తగ్గివుంటుంది మళ్ళీ ఆయన్తో భారత భాగవతాల్లోని పద్యాలు చదివించుకొని ఆనందించే అదృష్టం వుందని సంతోషించాడు. కాని అది తెచ్చిపెట్టుకున్న సంతోషం. ఏ క్షణాన వైరొస్తుందో అని లోపల భయంగానే వుంది.

అటూ ఇటూ వూహించుకుంటూ ఆరోజంతా గోపీ ఇంట్లోనే వున్నాడు. సాయంకాలం అయింది. గుండె కొంచెం నిబ్బరపడింది. 'తగ్గకపోతే మళ్ళీ వైరిచ్చేవారే.' అనుకొని నిట్టూర్చాడు—

ఇంతలో గోపీ తండ్రే రైలుదిగి వచ్చాడు. ఆయన వాలకం చూసేటప్పటికి గోపీ గుండె బేజారయిపోయింది- ఏమయిందో! పెదనాన్న .... అక్కడ వుండలేక, తండ్రి మొహం చూడలేక ఇంట్లోకి వెళ్ళటానికి లేచాడు.

"గోపీ?" అని గద్దించాడు తండ్రి.

గోపీ ఆగాడు. హృదయం రెపరెపలాడింది ...ఏం చెబుతాడో!

"నువ్వెందుకు రాలేదు?"

గోపీ మాటాడలేదు. శరీరం కంపించింది—

"వెధవా, నీకోసం కలవరించి చచ్చిపోయాడు— మా వంశంలో చెడబుట్టావ్—"

గోపీకి ఆఖరిమాటలు వినబడలేదు. "పెదనాన్న చనిపోయాడా? చనిపోతూ పోతూ నన్ను కలవరించాడా?—" ఊగిపోయాడు.

"నాల్గు రూపాయిలు ఖర్చవుతవని- ఎంతపనిచేశావ్!"

గోపీ నవాబు చెప్పలేదు. తండ్రివైపు పుక్కూడా చూడ లేదు- శూన్యంలోకి వెర్రిగా చూస్తూ 'కలవరించాడా!' అనుకుంటూ నిలబడి పోయాడు. తండ్రికి కోపం ఎక్కువయింది.

తండ్రి మీదమీదకు రావటం గోపీ చూడలేదు. చెంప చిటేలుమన్నది దెబ్బతో గోపీ కళ్ళు గిర్రున తిరిగినై కన్నీరు జలజలరాలింది. తండ్రికి కోపంతీరలేదు. "వెధవా, నీ సంగతి నేను కనిపెడుతూనే వున్నాను. ఇదేనా నువ్వు రాతల్లో ఏడ్చే ఆర్థిక దృక్పథం...."

గోపీ తండ్రిని చూచాడు. చాలా జాలిగా చూశాడు. అప్పుడతని కండ్లకు తన తండ్రి అర్భకుల్లో అర్భకుడుగా కనిపించాడు. ఆ చూపులు తండ్రి కోపాన్ని మరీ రగుల్కొలిపాయి. "పో....నీబోటివాళ్ళకి నా యింటో చోటులేదు....పో!"

గోపీని బయటకు నెట్టి తలుపు వేసుకున్నాడు. గోపీ నెమ్మదిగా లేచి నిలబడ్డాడు. "ఇదేనా నువ్వు రాతల్లో ఏడ్చే ఆర్థికదృక్పథం" అనే తండ్రిమాటలు చెవుల్లోగింగిరుమన్నయ్.

"ఇదే....ఇదే" అనుకుంటూ గబగబా మెట్లు దిగిపోయాడు విశాల ప్రపంచంలోకి....